క్లుప్తంగా

హెచ్ఐవీ నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నాతవరం : హెచ్ఐవీ, ఎయిడ్స్ సోకినంత మాత్రాన ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంఎల్‌హెచ్‌పి సరోజిని అన్నారు. మండలంలో శనివారం గన్నవరం, శృంగవరం గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో సమగ్ర ఐఈసి ప్రచార కార్యక్రమంలో భాగంగా మీకు తెలుసా అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. లింక్ వర్క్ స్కీమ్ మండల సూపర్‌వైజర్ రామలక్ష్మి మాట్లాడుతూ అవగాహన సదస్సు మండల వ్యాప్తంగా నెల రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. చాలా మందికి హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన లేక భయాందోళన చెందుతున్నారన్నారు. వ్యాధి రాకుండా ముందస్తుగా తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాధి సోకిన వారు నియంత్రణకు ఏవిధంగా వైద్య సేవలు పొందాలన్న అంశాలను వివరించారు.

గ్రామాల్లో ఘనంగా అన్న సమారాధనలు



ఘాట్‌రోడ్డు సమీపంలో జరిగిన అన్నసమారాధన కార్యక్రమం

మాడుగుల రూరల్ : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, ఘాట్‌రోడ్డు జంక్షన్ సమీపంలో గల యన్నంశెట్టి అప్పారావు సిమెంట్ బట్టి వద్ద శనివారం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెచ్చెట్టి, కాకర, పెంటకోట, కళ్లాల రైతులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆరు బయట రోడ్లపై చెత్త వేయరాదు



రోడ్లపై చెత్త వేయరాదని ర్యాలీలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నాతవరం : వీధుల్లో ఆరుబయట చెత్త వేయడం ద్వారా వ్యాధులు మనమే తెచ్చుకుంటున్నామని మర్రిపాలెం పంచాయతీ కార్యదర్శి చిన్న అన్నారు. ఆయన శనివారం మర్రిపాలెం పంచాయతీలో వీధుల్లో పర్యటించి చెత్త రోడ్లపై వేయరాదంటూ అవగాహన ర్యాలీ ద్వారా హితవు పలికారు. తడిచెత్త, పొడి చెత్త వేరు చేసి ఇంటింటికీ సరఫరా చేసిన డస్ట్ బిన్లలో వేయలన్నారు. ఇంటి పరిసరాలతో పాటు వీధులను శుభ్రంగా ఉంచుకునే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. వ్యాధులు రాకుండా నివారించాలంటే ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు

గొలుగొండ : మండలంలో జోగుంపేట, శ్రీరాంపురం, గొలుగొండ రెల్లికాలనీ, ఏఎల్ పురం పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి వినాయక నిమజ్జనం కార్యక్రమం నిర్విహించారు. నిమజ్జనం సందర్భంగా అయా గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలకు ఫలహారాలు సమర్పించారు. నిమజ్జనం సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గిరిజన గ్రామాలు సందర్శించిన విద్యుత్ అధికారులు



డోలవానిపాలెం గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

రావికమతం : మండలంలో గిరిజన గ్రామం డోలవానిపాలెంలో గిరిజనుల కరెంట్ సమస్యపై విద్యుత్ అధికారులు డీఈఈ, ఏఈ శనివారం సందర్శించారు. గిరిజనులుకు సమాచారం లేకపోవడంతో పొలం పనులకు వెళ్లిపోయారు. అక్కడ ఉన్న కొందరు గిరిజనులతో మాట్లాడి వారి సమస్య తెలుసుకున్నారు. సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

రోగాల బారిన 'మోడల్ కాలనీ'

- కుళాయిల్లో కలుషిత నీటితో జనం అవస్థలు
- ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు చెంతనే కాలనీ
- నెలలు తరబడి సమస్య వెంటాడుతున్నా పట్టించుకోని అధికారులు



తాగునీటి పథకంపై సరిగా వేయని మూత



ఎర్రటి బురదతో వస్తున్న కుళాయి నీరు



ఇందిరమ్మ మోడల్ కాలనీ



కాలనీ అంతంటికీ ఈ ట్యాంకు నుంచే నీరు

నాతవరం : ఇందిరమ్మ మోడల్ కాలనీలో కుళాయిలు ద్వారా కలుషిత నీరు రావడంతో ప్రజలు తాగునీటి కోసం అనేక బాధలు పడుతున్నారు. మండల కేంద్రంలో దివంగత నేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి హయంలోఇల్లులేని పేదలకు తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న కమ్యూనిటీ స్థలంలో సుమారుగా 300 మందికి పైగా లబ్ధిదారులకు స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించారు. ఈ కాలనీకి గత వైఎస్సార్‌సీపీ హయంలో ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించారు. దివంగత నేత వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అంకంరెడ్డి జమీలు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ప్రభుత్వ నిధులతో సర్వాంగ సుందరంగా వినాయకుడి ఆలయం నిర్మించి ప్రారంభించారు. నాతవరం గ్రామానికి వన్నె తెచ్చే విధంగా ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదురుగా ఇందిరమ్మ మోడల్ కాలనీ దర్శనమిస్తుంది. గతంలో ఇందిరమ్మ మోడల్ కాలనీలో ఏ సమస్య వచ్చినా స్థానికులు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన వెంటనే పరిష్కరించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాగునీటి సమస్యపై అనేక సార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు జెడ్పీటీసీ సభ్యులు ఎంపీపీ పదువులన్నీ వైఎస్సార్‌సీపీకి చెందిన వారే ఉన్నారు. ఆయా ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలపై అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని బహిరంగంగా అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు నాతవరం పంచాయతీ కార్యదర్శి ఎంపీడీవో సైతం రెగ్యులర్ అధికారులు ఉండేవారు. ఆ సమయంలో ఏ సమస్య ఉన్నా వారి దృష్టికి తీసుకెళ్తే యుద్ధ ప్రతిపదికన పరిష్కరించేవారు. ఏడాది కాలంగా రెగ్యులర్ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి లేరు, వారు ఆఫీసులో ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితులు ఉన్నాయి. ఇందిరమ్మ మోడల్ కాలనీలో వర్షం పడినప్పుడల్లా కుళాయిలు పైపులు ద్వారా బురద నీరు ఎర్రగా కలుషితమై వస్తుంది. ఈ సమస్య మూడు నెలలుగా వెంటాడుతున్నా కనీసం ఎవరూ పట్టించుకోలేదన కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ మోడల్ కాలనీలో తాగునీటి పథకంపై కప్పు సరిగా మూత వేయక పక్షులు రెట్టలు దుమ్ము, ధూళి, చెట్ల కొమ్మలు నీటిలో పడుతున్నాయి. నిబంధనల ప్రకారం తాగునీటి పథకాలు శుభ్రం చేయడం, క్లోరినేషన్ వంటి పనులు చేయలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కలుషిత నీరు వల్ల రోగాలు వ్యాపిస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో మూర్తిబాబును వివరణ కోరగా ఈ సమస్య తన దృష్టికి వచ్చిందని, స్వయంగా పరిశీలించానని, వర్షం పడినప్పుడల్లా బురద నీరు వస్తుందని అన్నారు. పంచాయతీ కార్యదర్శిని పిలిపించానని వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తానన్నారు.

రైతులకు ఎరువులు కూడా అందించలేని కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావు



మాడుగుల రూరల్ : రైతులకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు అవసరమయ్యే యూరియా ఎరువులను కూడా అందించలేని చేతకాని ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని చోడవరం సీడీసీ చైర్మన్, జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావు అన్నారు. మండలంలో ఘాట్‌రోడ్డులో ఆయన సాక్షితో శనివారం మాట్లాడారు. ప్రస్తుతం ఖరీఫ్ వరినాట్లు పూర్తి కాగా వరి పంటకు యూరియా ఎరువులు వేస్తారని, ఈ యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా యూరియా, ఇతర ఎరువులు రైతులకు పూర్తి స్థాయిలో అందించారని తెలిపారు. నేడు ఈ కూటమి పాలనలో మామిడి రైతులు, ఉల్లి రైతులు, మిర్చి, పొగాకు రైతులు గిట్టుబాటు ధర కోసం ఆందోళన చేస్తుంటే ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు అయినా లేదని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల కోసం కార్మికులు రోడ్డెక్కి రోదిస్తుంటే కనీసం ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందక లక్షలాది మంది విద్యార్థులు ఉద్యమిస్తుంటే ప్రభుత్వానికి చలనం లేదన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఆశ, అంగన్‌వాడీ, కార్యకర్తలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల రోడ్డున పడ్డ ఆటో కార్మికులు ఆందోళనలు ప్రభుత్వానికి పట్టవన్నారు. నిరుద్యోగులు, ఉపాధ్యాయులు సైతం రోడ్డెక్కి నిరసనలు చేస్తుంటే కూటమి ప్రజా ప్రతినిధులు, మంత్రులు రుషికొండ టూరిస్టు భవనాల్లో షికార్లు చేస్తున్నారని విమర్శించారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కేసులు తప్పవు



రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి మంగవేణి, వ్యవసాయాధికారి సుగుణ

నాతవరం : రైతులకు యూరియా అధిక ధరలకు విక్రయిస్తే క్రిమినల్ కేసు పెడతామని మండల ప్రత్యేకాధికారి మంగవేణి అన్నారు. మండలంలో గునుపూడి రైతుసేవా కేంద్రంలో శనివారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలో సరుగుడు, శృంగవరం, నాతవరం, గనుపూడి, డి.యర్రవరం, గొలుగొండపేట, గుమ్మడిగొండ రైతు సేవా కేంద్రాల్లో యూరియా సిద్ధంగా ఉందన్నారు. ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా ఉందని ప్రైవేటు డీలర్లు గానీ రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది గాని నిబంధనలు ఉల్లంఘించి అధిక రేట్లకు యూరియా ఇతర ఎరువులు విక్రయిస్తే కేసులు పెట్టడం ఖాయమన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే చర్యలు తీసుకోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి సుగుణ, గునుపూడి సర్పంచ్ వేముల సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ సుర్ల స్వామినాయుడు, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు కొండ్రు మరిడియ్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



ఆనందపురం జంక్షన్‌లో నిరసన ర్యాలీ చేస్తున్న ఆటో వర్కర్సు

కె.కోటపాడు : స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో వర్కర్సు ఉపాధి కోల్పోయారని ఆటో వర్కర్సు యూనియన్ అధ్యక్షుడు రంధి రాజునాయుడు అన్నారు. ఆనందపురం గ్రామంలో మూడు ఆటోస్టాండుల అధ్యక్ష, కార్యదర్శులు ఆధ్వర్యంలో శనివారం కృష్ణరాయుడుపేట రైవాడ కాలువ నుంచి ఆనందపురం ఆటో స్టాండు వరకు ఆటో డ్రైవర్లు నిరసన ర్యాలీ చేపట్టారు. ఆనందపురం మూడు రోడ్లు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. రాష్ట్రంలో 10 లక్షల మంది ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని, ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, నూతన రవాణా చట్టంలో ఉన్న శిక్షలను తగ్గించాలని కోరారు. ప్రతి ఆటో కార్మికుడికి సబ్సిడీపై ఐదు లక్షల రుణం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పైడితల్లి, నీలి కోటి, పి.అవతారం, సారికేశరావు, లోకల శ్రీను, తో పాటు 100 మంది ఆటో వర్కర్సు పాల్గొన్నారు.

'చిన్న సమస్యలపై వివాదాలు వద్దు'



పీజీఆర్ఎస్ అర్జీలు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి మంగవేణి

నాతవరం : ప్రతి చిన్న విషయానికి కేసులు పెట్టుకుంటే కుటుంబాల మధ్య వివాదాలు పెరిగిపోతాయని మండల ప్రత్యేకాధికారి మంగవేణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పీజీఆర్ఎస్ ఫిర్యాదుదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో ఫిర్యాదులను పరిశీలించగా అధికంగా ఇంటి స్థల వివాదాలు, భూ వివాదాలు, కుటుంబ సభ్యుల తగాదాలే అధికంగా ఉన్నాయని తెలిపారు. గ్రామాల్లో పెద్దల సమక్షంలో పరిష్కరించుకునే చిన్న సమస్యలపై సైతం కేసులు కోర్టులకు వెళ్లడం వల్ల ఇరు వర్గాలు ఆర్థికంగా నష్టపోతారని హెచ్చరించారు. ఫిర్యాదులపై ప్రభుత్వ నిబంధనలు అనుసరించి చర్యలు చేపడతామన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి వివాదాలకు చెందిన భూముల్లోకి దిగి ఇరువర్గాలు తగాదాలు పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యానికి సహకరించండి



రైవాడలో పారిశుధ్యంపై గ్రామస్తులకు సూచనలు చేస్తున్న డీఎల్‌డీవో మంజులవాణి

దేవరాపల్లి : రైవాడ గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని డీఎల్‌డీవో, మండల ప్రత్యేక అధికారి ఎస్.మంజులవాణి కోరారు. రైవాడలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ చల్లా లక్ష్మితో కలిసి శనివారం ఆమె పర్యటించారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యం ఉంటేనే సంపూర్ణ పారిశుధ్యం సాధ్యపడుతుందన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, చల్లా నాయుడు, డిప్యూటీ ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్, హౌసింగ్ ఏఈ ఎస్. భవ్యతేజ, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్, పంచాయతీ కార్యదర్శి అప్పారావు పాల్గొన్నారు.

దేవరాపల్లి సంపద కేంద్రం పరిశీలన

దేవరాపల్లిలోని చెత్త సంపద కేంద్రాన్ని స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ డి.పద్మిని, జిల్లా కన్సల్టెంట్ జాని శనివారం పరిశీలించారు. సంపద కేంద్రంలోని ప్లాస్టిక్ కటింగ్ యంత్రం కండిషన్‌ను పరిశీలించారు. ఈ యంత్రాన్ని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్ పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల ఉపాధిని కాపాడండి



ఆర్డీవో కార్యాలయం వద్ద గీత కార్మికుల ధర్నా

నర్సీపట్నం : కల్లుగీత కార్మికుల ఉపాధిని కాపాడండి అంటూ కల్లుగీత కార్మికులు శనివారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆర్డీవో, ఎక్సైజ్ సీఐకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర దేవుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్లుగీత కార్మికులను ఆదుకుంటుందని ఆశించామన్నారు. మద్యం దుకాణాలను రాజకీయ నాయకులకు సంబంధించిన వారికి కేటాయించారన్నారు. గీత వృత్తికి నష్టం చేసేలా ఉన్న బెల్టుషాపులను నియంత్రించడం లేదన్నారు. గీత కార్మికుల కార్పొరేషన్‌కు తగిన నిధులు ఇవ్వడం లేదన్నారు. కేరళ వంటి రాష్ట్రాల్లో తాటికల్లు ఆధారిత ఆహార పదార్థాలు తయారీకి ప్రభుత్వం కార్పొరేషన్ పెట్టి ప్రోత్సహిస్తుందన్నారు. ఆ తరహాలో ఏపీలో ప్రవేశపెట్టాలన్నారు. లేకుంటే భవిష్యత్తులో కల్లుగీత కార్మికులతో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, ఎన్.రాజుబాబు, లోవరాజు, రమణ, చిన్న, సత్యం పాల్గొన్నారు.

గంజాయి తరలింపుపై డ్రోన్ నిఘా

రావికమతం : గంజాయి రవాణా, అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు పోలీసుశాఖ అవసరమైన చర్యలు చేపట్టారు. గంజాయి రవాణాను అరికట్టడానికి మండలంలో కొట్నాబిల్లి, ఎర్రబంద, బుడ్డిబంద, కవుగుంట గ్రామాల సమీప ప్రాంతాల్లో శనివారం రావికమతం ఎస్ఐ రఘువర్మ పోలీసు సిబ్బందితో కలిసి డ్రోన్ కెమెరా ద్వారా కాలిబాటలను గుర్తించేందుకు సర్వే చేశారు. రావికమతం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి మార్గాలను డ్రోన్ ద్వారా గుర్తించి గంజాయి రవాణా కాలిబాటలను డ్రోన్ ద్వారా నియంత్రించడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదం
- అభివృద్ధిపై చర్చకు పరస్పర సవాళ్లు



వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ బుల్లిదొర, టీడీపీ కౌన్సిలర్లు పద్మావతి, రాజేష్ మధ్య వాగ్వాదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కోనేటి రామకృష్ణ

నర్సీపట్నం : మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా సాగింది. చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి వ్యక్తిగత కారణాలతో సెలవు పెట్టడంతో, వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ చైర్మన్‌గా సభను నడిపించారు. అభివృద్ధిపై పాలకపక్షం కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, ప్రతిపక్షం టీడీపీ కౌన్సిలర్లు సిహెచ్.పద్మావతి, సిహెచ్.రాజేష్ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు వీఎంఆర్‌డీఏ నుంచి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.5 కోట్లు తీసుకువచ్చారని కౌన్సిలర్ పద్మావతి అన్నారు. బుల్లిదొర కల్పించుకుని ఈ నిధులతో ప్రజలు ఇబ్బందుల దృష్ట్యా మున్సిపాలిటీలోని గుంతలమయమైన ప్రధాన రోడ్డు మరమ్మతులు చేపడితే బాగుంటుందన్నారు. మెయిన్ రోడ్డు మున్సిపాలిటీ పరిధిలోకి రాదని, ఆర్అండ్‌బీకి సంబంధించిందని కమిషనర్ సురేంద్ర బదులిచ్చారు. ఈ నిధులు ప్రాధాన్యతా పనులకు పెడితే బాగుంటుందని దొర పేర్కొన్నారు. టీడీపీ కౌన్సిలర్ పద్మావతి కల్పించుకుని స్పీకర్ 28 వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి గాలికి వదిలేసారన్నారు. దీంతో టీడీపీ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ బుల్లిదొర మధ్య అభివృద్ధిపై మాట మాట పెరిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఏడాదిన్నర కాలంలో చేసిన అభివృద్ధి, కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని బుల్లిదొర పేర్కొన్నారు. అభివృద్ధిపై చర్చకు సిద్ధమంటూ అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు సవాళ్లు..ప్రతిసవాళ్లు చేసుకున్నారు. చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు ఖాళీ స్థలాల్లో వర్షం నీరు చేరడం వల్ల చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలో జ్వరాలు ఎక్కువగా ఉన్నందున దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రోడ్డు మంజూరై ఏడాదిన్నర కావస్తున్నా ఎందుకు రోడ్డు వేయలేదని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సిరసపల్లి నాని అధికారులను నిలదీశారు. కాంట్రాక్టర్ జాప్యం చేస్తున్నారని డీఈ కామేశ్వరరావు బదులిచ్చారు. అవసరమైతే కాంట్రాక్టర్‌ను మార్చాలని నాని అధికారులకు సూచించారు. వార్డులో వీధిలైట్లు వెలగడం లేదని, లైట్లు వేయాలని అధికారులను కోరారు. వాటర్ ట్యాంక్ వద్ద నాచుపట్టి తాగునీటికి వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ దాడిరత్నం సభ దృష్టికి తీసుకువెళ్లారు. బ్లీచింగ్ అడిగితే లేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెబుతున్నారని కౌన్సిలర్ పేర్కొన్నారు. కమిషనర్ కల్పించుకుని బ్లీచింగ్ లేదని చెప్పడం సరికాదని బ్లీచింగ్ కావాల్సినంత ఉన్నప్పుడు ఇవ్వడానికి వచ్చిన ఇబ్బంది ఏమిటని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ని మందలిచ్చారు. శానిటేషన్ అధ్వానంగా ఉందని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రత్నం కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లారు. శానిటేషన్‌పై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నందున పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చైర్మన్ రామకృష్ణ అధికారులను ఆదేశించారు.

నేడు మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరగనున్నాయని, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి కుంకుమ పూజల్లో పాల్గొనాలని కమిటీ కోరింది.

ఏరియా ఆస్పత్రి మరమ్మతులకు రూ.47 లక్షలు

నర్సీపట్నం: ఏరియా ఆస్పత్రి మరమ్మతులకు జిల్లా కలెక్టర్ రూ.47 లక్షలు మంజూరు చేశారని స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఏరియా ఆసుపత్రి ద్వారా మైదాన, గిరిజన ప్రాంత ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారన్నారు. గత నెలలో జరిగిన హాస్పిటల్ సమీక్ష సమావేశంలో కొన్ని అవసరాలను గుర్తించడంతో, కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మరమ్మతులకు రూ.47 లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో ఆపరేషన్ థియేటర్, ఆక్సిజన్ పైప్‌లైన్, మినీ సెప్టిక్ ట్యాంక్, ఇంటర్నల్ ఎలక్ట్రికల్, డ్రెయిన్లు, నీటి సరఫరా వ్యవస్థ మరమ్మతులు చేపడుతున్నామన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. రూరల్ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతానికి రూ.72.50 లక్షలు నిధులు మంజూరైనట్టు స్పీకర్ వెల్లడించారు.

ఘనంగా అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ



అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు తదితరులు

దేవరాపల్లి : మండలంలోని కలిగొట్లలో రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్.అంబేడ్కర్, మాజీ భారత ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాలను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లక్కీ డ్రా నిర్వహించి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు, పాత్రునాయుడు, భాస్కరరావు, రామ్మూర్తినాయుడు, దళిత సంఘ నాయకులు కార్లి సాయి సుందరరావు, కాటపల్లి అప్పారావు పాల్గొన్నారు. కాగా మండలంలోని కొత్తపెంట గ్రామం పేరును కొత్తపేటగా మార్పు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వినతి పత్రాన్ని అందజేశారు.

దివ్యాంగ క్రీడాకారులకు సత్కారం

రావికమతం : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నేషనల్ బిల్డర్ శిలపరశెట్టి బాబి ఆధ్వర్యంలో అనకాపల్లిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర స్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి పతకాలు సాధించిన దివ్యాంగ విద్యార్థులు నక్కా బాల సరస్వతి,అప్పికొండ గణేష్,కోచ్ మహాలక్ష్మి నాయుడులను ఘనంగా సత్కరించారు. శుక్రవారం రాత్రి వి.వి.రమణ రైతు భారతిలో జరిగిన కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ సూర్యనారాయణ, ఖోఖో అసోసియేషన్ జైవీరు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్ఎంకు సన్మానం



హెచ్ఎం రమణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

నర్సీపట్నం : నర్సీపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తురకబడి) హెచ్ఎంగా పని చేస్తున్న కె.వి.రమణ ఉద్యోగ విరమణ పొందారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్, ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందిన హెచ్ఎం దంపతులను ఘనంగా సత్కరించారు. పీఆర్‌టీయు మండల అధ్యక్ష, కార్యదర్శులు వరహాలనాయుడు, రమేష్ పాల్గొన్నారు.

సబ్‌జైల్‌ను తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి



ఖైదీలకు తయారు చేసిన భోజనాన్ని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి షియాజ్ ఖాన్

నర్సీపట్నం : నర్సీపట్నం న్యాయ సేవా సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ శనివారం స్థానిక సబ్‌జైల్‌ను తనిఖీ చేశారు. జైల్లో అందుతున్న సౌకర్యాలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య నిపుణులు వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారని ఆరా తీశారు. భోజనం ఎలా ఉంటుందని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. బెయిల్ పెట్టుకునేందుకు ఆర్థిక స్తోమత లేని వారికి న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని జడ్జి ఖైదీలకు సూచించారు.